సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 29-1-2025
సంపుటి: 20 సంచిక: 260
పేజీలు: 4 వెల: రూ.1



## మెరుగైన వైద్యం అందించాలి

**(సత్యంన్యూస్, టెక్కలి)**

ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సమయ పాలన పాటించాలని సూచించారు. వైద్యుల హాజరు, ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది రోగులు వస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలు, సమయానికి ఆహారం అందిస్తున్నదీ లేనిదీ ఆరా తీసారు. చిన్నారుల వార్డు, జనరల్ వార్డు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పరికరాలు పని చేస్తున్నాయా, లేదా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.



- ❖ప్రమాదానికి కర్త, కర్మ, క్రియ ఫైర్ డిపార్ట్‌మెంటే
- ❖కళ్లు మూసుకొని అనుమతులిచ్చిన అధికారులు
- ❖మంటలు అదుపు చేయడంలో చేతులెత్తేసిన సిబ్బంది
- ❖నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం
- ❖నష్టనివారణలో అగ్నిమాపక శాఖ విఫలం

**'మాల్స్'లో ప్రమాద ఘంటికలు**



# 'సౌత్ ఇండియా'పై నెట్‌ప్రాక్టీస్



"అంతర్జాతీయ పిచ్‌ల మీద మనోళ్లు క్రికెట్ ఆడాలంటే ముందుగా నెట్‌ప్రాక్టీస్ చేస్తారు. ఎవరి బాలు ఎలా స్వింగ్ అవుతుంది? ఎవరు ఏ సైడ్ రెగ్యులర్‌గా క్యాచ్ ఇచ్చే అవకాశం ఉంది? వంటి విషయాలు తెలుసుకోవడం కోసం నెట్‌ప్రాక్టీస్ చేస్తారు. క్రికెట్‌తో పాటు అన్ని క్రీడ ల్లోనూ పోటీలకు ముందు నెట్‌ప్రాక్టీస్ కంపల్సరీ. సరిగ్గా ఇటువంటి నెట్‌ప్రాక్టీసే మన జిల్లా అగ్నిమాపక శాఖ సౌతిండియా షాపింగ్‌మాల్ మీద చేసింది. గడ్డికుప్పలు అంటుకుంటే గంటలు వాయించుకుంటూ వెళ్లి ఆర్పేసే ఫైరింజన్లు ఒక నాలుగంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం జరిగితే ఎలా వ్యవహరించాలో తెలుసుకోడానికి సౌతిండియా షాపింగ్‌మాల్ ప్రమాదం ఉపయోగపడింది తప్ప జరిగిన ఆస్తినష్టంలో పైసాను కూడా తగ్గించలేక పోయింది. ఆక్సిజన్ మాస్క్‌లంటే ఏమిటో తెలీదు. ఫైర్ డిపార్ట్‌మెంట్ యూనిఫామ్ తప్ప ఫైర్ రెసిస్టెన్స్ కోసం వాడే ఒక్క పరికరమూ లేదు. కానీ మంటలార్పు తామమ్మా అంటూ జిల్లా నలుమూలల నుంచి ఫైరింజన్లు ప్రమాదం జరిగిన రోజున వచ్చేశాయి. వాస్తవానికి ఈ సౌతిండియా షాపింగ్‌మాల్ అగ్నిప్రమాదం యాదృచ్ఛికం కావచ్చు కానీ, అంత పెద్ద స్థాయిలో మంటలు వ్యాపించడానికి, ఆస్తినష్టం జరగడానికి కర్త, కర్మ, క్రియ ఫైర్ డిపార్ట్‌మెంటే. కళ్లు మూసుకొని ఫైర్ ఎన్‌వోసీ ఇచ్చిన అధికారులు కనీసం ఫైర్ అయిన తర్వాతైనా ఆపే ప్రయత్నం చేయలేకపోయారు. ఇందుకు కారణం గడ్డికుప్పలు ఆర్పేవారు తప్ప మంటల్లోకి, పొగల్లోకి చొచ్చుకునిపోయే సిబ్బంది, వారికి అవసరమైన శిక్షణ లేమి ఇక్కడ మనకు కొట్టొచ్చినట్టు కనిపించింది. ఓ నాలుగంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగితే తామేమీ చేయలేమనుకున్నప్పుడు ఆ భవనానికి అనుమతులు ఇచ్చినప్పుడైనా అన్నీ సవ్యంగా ఉన్నాయో, లేవో చూసుకోవాల్సిన బాధ్యత అగ్నిమాపక శాఖదే. అటు ఎన్‌వోసీలు జారీ చేసిన దగ్గర్నుంచి ఇటు మంటలు ఆర్పేవరకు ప్రతీచోట ఆ శాఖ వైఫల్యం కనిపిస్తుంది. కేవలం చీరలు మాత్రమే కాలి పోవడంతో ఆస్తినష్టంతో ఆగింది. అదే స్థానంలో కస్టమర్లు, షాపింగ్‌మాల్ సిబ్బంది ఉండివుంటే వారి ప్రాణాలకు ఎవరు దిక్కు? ఇప్పుడు అంతటా ఇదే ప్రశ్న. శ్రీకాకుళం లాంటి ప్రాంతంలో నాలుగంతస్తుల భవనం మీదకు వెళ్లడానికి అవసరమైన పరికరాలు లేనప్పుడు ఆ మేరకు అనుమతులు ఎందుకిచ్చినట్టు? దేశవ్యాప్తంగా బట్టల షాపులున్న సౌతిండియా షాపింగ్‌మాల్‌కు ఇది పెద్ద నష్టం కాకపోవచ్చు. కానీ ప్రాణనష్టం జరిగితే ఎవరిమీద చర్యలు తీసుకుంటారు?"

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగరంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అగ్ని ప్రమాదంలో కాలి బూడిద కావడానికి షాపింగ్ యాజమాన్యంతో పాటు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు బాధ్యులే. అగ్నిప్రమాదం జరిగి రూ. కోట్లలో ఆస్తినష్టం వాటిల్లితే కానీ అగ్నిమాపక శాఖ అధికారులు కళ్లు తెరవలేదు. ప్రమాదం జరిగిన 48 గంటల తర్వాత స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ నుంచి సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఎన్‌వోసీ రద్దు చేస్తున్నట్టు యాజమాన్యానికి నోటీసులు పంపించారు. 2022 జనవరి 11న ఆక్యుపెన్సీ కోసం అగ్నిమాపకశాఖ కార్యాలయం ద్వారా జారీచేసిన ఎన్‌వోసీని మాల్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదం కారణంగా రద్దు చేసినట్టు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 25 తెల్లవారుజామున సంభవించిన సంఘటనను సమీక్షించిన తర్వాత అగ్నిప్రమాదానికి రెండు ప్రధాన అంశాలు కారణమయ్యాయని నోటీసుల్లో పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ భద్రతా చర్యలను పాటించకపోవడం, స్మోక్ ఎక్స్‌ట్రాక్షన్ సిస్టమ్ లేకపోవడం ప్రమాదానికి కారణమని తేల్చారు. అయితే అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని కప్పిపుచ్చుకొనే - మిగతా 4లో

## అమెరికావాడి పొగరు, బలుపు దింపాలంటే..

# అది చైనాకే సాధ్యం




**చైనా వాళ్ల దెబ్బకి అమెరికన్ స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. స్టాక్ మార్కెట్‌లో అమెరికన్ టెక్నాలజీ ఇండెక్స్ నాస్‌డాక్ 100 ఒక్కరోజే 3 శాతం పడిపోయింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన అమెరికా స్టాక్స్ అయితే భారీగా పడిపోయాయి, ఎన్‌వీఐడీఐఏ అయితే ఏకంగా ఒక్కరోజులోనే 17 శాతం పడింది. అమెరికాలో కొన్ని వేల, లక్షల కోట్లు ఒక్క రోజులోనే ఆవిరయ్యాయి.**




✍ **జగన్నాథరావు, ముచ్చట కోసం**

చైనా పోరాటపటిమని కచ్చితంగా అభినందించాలి. హాట్సాఫ్ చైనా. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి చాలామందికి తెలుసు. ప్రస్తుతం ఈ కృత్రిమ మేధలో అమెరికానే టాప్. ఈ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో చాట్ జీపీటీ కూడా ఎక్కువ భాగం తెలుసు. అయితే చాట్ జీపీటీని రూపొందిన సంస్థ పేరు ఓపెన్ ఏఐ.

అమెరికా అధ్యక్షుడు అవగానే డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ మధ్య ఓపెన్ ఏఐ సంస్థ సీఈవో శ్యాం ఆల్టమన్‌ని కలిసి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో మనం ఎవరికీ అందనంత ఎత్తుకి వెళ్లాలి, మన దరిదాపుల్లోకి కూడా ఎవరూ రాకూడదు అని చెప్పి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో భారీగా పెట్టుబడులు పెడదామని చెప్పాడు. ఇంతవరకు బానే ఉంది.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రపంచంలో నంబర్ వన్ సంస్థ ఓపెన్ ఏఐ, కంపెనీ సీఈవో శ్యాం ఆల్ట్‌మన్ గతంలో (జూన్ 2023) ఇండియా వచ్చినప్పుడు అతన్ని ఒక ప్రశ్న అడిగారు 'మా ఇండియాలో కూడా ఆర్టిఫీషియల్ ఇంటెజెన్స్‌కి సంబంధించి మేం అభివృద్ధి చెందాలి అంటే ఏమి చేయాలి, ఎలా ప్రారంభించాలి' కొంచెం చెప్తారా..? అని. దానికి సమాధానంగా ఓపెన్ ఏఐ సీఈవో ఇలా చెప్పాడు.. 'మీ ఇండియన్స్ వలన కానీ, మీ కంపెనీల వలన కానీ ఇది సాధ్యమవదు.. కంప్లీట్లీ హోప్‌లెస్.. మీ ఇండియన్స్ వలన ఎప్పటికీ అయ్యే పనికాదు.. టోటల్లీ హోప్‌లెస్' అన్నాడు. ఆ పొగరు, అహంకారం అమెరికన్స్‌కి ఎలా వచ్చిందో, ఎందుకు వచ్చిందో తెలియదు కానీ కట్ చేస్తే.. రెండు సంవత్సరాలు తిరగక ముందే మన ఇండియన్స్ క్రియేట్ చేయలేదు కానీ మన పక్కన ఉన్న చైనా వాళ్లు అమెరికా ఓపెన్ ఏఐ చాట్ జీపీటీ కంటే కొంచెం గొప్పగానే 'డీప్ సీక్' తయారు చేశారు నిన్న. చైనా వాళ్ల దెబ్బకి అమెరికన్ స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. స్టాక్ మార్కెట్‌లో అమెరికన్ టెక్నాలజీ ఇండెక్స్ నాస్‌డాక్ 100 ఒక్కరోజే 3 శాతం పడిపోయింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన అమెరికా స్టాక్స్ అయితే భారీగా పడిపోయాయి, ఎన్‌వీఐడీఐఏ అయితే ఏకంగా ఒక్కరోజులోనే 17 శాతం పడింది. అమెరికాలో కొన్ని వేల, లక్షల కోట్లు ఒక్క రోజులోనే ఆవిరయ్యాయి. అమెరికన్ కంపెనీల తలపొగరు ఒక్క రోజులోనే 100 సెంటీమీటర్లు దిగింది. ఒక చిన్న చైనా స్టార్ట్ అప్ సంస్థ 'డీప్ సీక్' దెబ్బకి అమెరికా కంపెనీలతో సహా డోనాల్డ్ ట్రంప్ కూడా అబ్బా అని అరిచాడు. అవన్నీ పక్కన పెడితే చైనా స్టార్ట్ అప్ సంస్థ డీప్ సీక్ ఫౌండర్ పేరు 'లియాంగ్ వెన్ ఫెంగ్'. ఇతను చైనాలో ఒక బడిపంతులు కొడుకు. చైనాలో మంచి యూనివర్శిటీల్లో చదివిన/ చదువుతున్న పిల్లలని తీసుకొని దీన్ని రూపొందించాడు. చాలా తక్కువ ఖర్చుతోనే డీప్ సీక్ తయారుచేశాడు. చైనా వాళ్లకి ఇంగ్లీష్ పెద్దగా రాకపోయినా అమెరికాలో ఉన్న ప్రతి పెద్ద కంపెనీ, టెక్నాలజీకి ప్రత్యామ్నాయం సొంతంగా తయారు చేసుకున్నారు.

### అమెరికా- చైనా పోలికలు:

**చైనా ఎప్పటికప్పుడు అమెరికా టెక్నాలజీకి సమానమైన లేదా బెటర్ ప్రత్యామ్నాయాలను తయారు చేస్తూ ముందుకెళ్తోంది.**

1. అమెరికా చాట్ జీపీటీకి చైనా ప్రత్యామ్నాయం డీప్ సీక్
2. అమెరికా గూగుల్‌కి చైనా ప్రత్యామ్నాయం బైడూ
3. అమెరికా అమెజాన్‌కి చైనా ప్రత్యామ్నాయం అలీబాబా
4. అమెరికా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌కి చైనా ప్రత్యామ్నాయం వీచాట్, వైబో, టిక్‌టాక్.
5. అమెరికా యూట్యూబ్‌కి చైనా ప్రత్యామ్నాయం యూకూ
6. అమెరికా నెట్‌ఫ్లిక్స్‌కి చైనా ప్రత్యామ్నాయం బిలిబిలి
7. అమెరికా ఆపరేటింగ్ సిస్టమ్ ఐవోఎస్ ఆండ్రాయిడ్‌కి చైనా ప్రత్యామ్నాయం హార్మనీ ఓఎస్.
8. అమెరికా స్మార్ట్‌ఫోన్స్ (యాపిల్)కు చైనా ప్రత్యామ్నాయం షావోమి, హువావే, ఒప్పో, వివో...
9. అమెరికా ల్యాప్‌టాప్ (డెల్)కు చైనా ప్రత్యామ్నాయం లెనోవో
10. అమెరికా నెట్‌వర్కింగ్ (సిస్కో)కు చైనా ప్రత్యామ్నాయం హువావే
11. అమెరికా పేమెంట్ సిస్టమ్ (వీసా, మాస్టర్‌కార్డ్)కు చైనా ప్రత్యామ్నాయం వీచాట్ పే, అలీపే
12. అమెరికా ఈ-కామర్స్ (వాల్‌మార్ట్)కు చైనా ప్రత్యామ్నాయం సునింగ్, గోమ్
13. అమెరికా రైడ్‌షేరింగ్ (యుబెల్)కు చైనా ప్రత్యామ్నాయం దీది చుక్సింగ్
14. అమెరికా ఎలక్ట్రిక్ కార్లు (టెస్లా)కు చైనా ప్రత్యామ్నాయం బీవైడీ, నియో
15. అమెరికా క్లౌడ్ కంప్యూటింగ్ (ఏడబ్ల్యూఎస్, అజూర్)కు చైనా ప్రత్యామ్నాయం అలీబాబా క్లౌడ్, టెన్సెంట్ క్లౌడ్
16. అమెరికా వీడియో గేమ్స్ (యాక్టివిజన్ బ్లిజ్జార్డ్)కు చైనా ప్రత్యామ్నాయం టెన్సెంట్, నెట్‌ఈజ్
17. అమెరికా ఫిల్మ్ మేకింగ్ (వార్నర్ బ్రదర్స్)కు చైనా ప్రత్యామ్నాయం వాండా పిక్చర్స్
18. అమెరికా ఆఫీస్ సాఫ్ట్‌వేర్ (ఎంఎస్ ఆఫీస్)కు చైనా ప్రత్యామ్నాయం డబ్ల్యూపీఎస్ ఆఫీస్
19. అమెరికా ఆపరేటింగ్ సిస్టమ్ (విండోస్)కు చైనా ప్రత్యామ్నాయం కైలిన్ ఓఎస్.
20. అమెరికాతో సమానంగా లేదా ఎక్కువే చైనావాళ్లు సొంత టెక్నాలజీతో సూపర్ కంప్యూటర్స్ తయారు చేసుకున్నారు. అమెరికన్స్ మా దగ్గరే ఎక్కువ ఉన్నాయంటారు.. అది వేరే విషయం. ఈ భూమి మీద కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరూ మంచిగా ఉండాలి, బాగుపడాలి. మరొక్కసారి హాట్సాఫ్ చైనా.




● ఎడిటోరియల్

## అదీ సంఘీల నిస్సిగ్గు జీవనం..

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదేళ్లయిన సందర్భంగా ఆజాదీ అమృత మహోత్సవాలు జరుపుకుని నడుస్తున్న వేళ, ఇది స్వాతంత్ర్యమే కాదని గుర్తించ నిరాకరించడం ఈ దేశభక్త నాయకునికి ఎలా సాధ్యమైంది? ఈ మధ్య రాష్ట్రీయ స్వయం సేవక సంఘం అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న వచ్చింది అసలు స్వాతంత్ర్యం కాదని, 2024 జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రతిష్టాపనతోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నాడు. అంతేకాదు, రాముడు, కృష్ణుడు, శివుడు కేవలం దేవుళ్లే కాదు, మన నాగరికతా విలువలకు, సనాతన ధర్మానికి గుర్తులు అని బోధించారు. రెండు విలువల మధ్య యుద్ధం జరిగి విజయం పొందిన సందర్భం అని సెలవిచ్చారు. ఇది అత్యంత దారుణమైన విషయం. రాముడు, కృష్ణుడు, శివుడు ఇంకా ముప్పది మూడు కోట్ల దేవుళ్లు ఉండవచ్చుగాక, వారిని విశ్వాసాల మేరకు ఆరాధించనూవచ్చు. కానీ వారికి గుడులను నిర్మించడానికి, విగ్రహాలు ప్రతిష్టించడానికీ, మన దేశ స్వాతంత్ర్యానికి ముడివేయటం అసంబద్ధమైన వాదం మాత్రమే. ఒక దేవుని గుడిని కూలగొట్టి, మరో దేవునికి గుడి కట్టడం స్వాతంత్ర్యం ఎలా అవుతుంది? అంతేకాదు, ఈ వాదన మనం ఇంతకాలంగా అనుభవిస్తున్న స్వేచ్ఛను, ఆధునిక ప్రజాస్వామిక విధానాన్ని, రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసినట్టేకదా. రెండొందల ఏళ్ల ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి పొందేందుకు ప్రజలు పోరాడిన చరిత్రనంతా చులకన చేయటం వారికే చెల్లింది. ఎంతోమంది యోధులు తమ జీవితాలను త్యాగం చేశారు. ప్రాణాలిచ్చారు. ఉరికంభాలెక్కారు. ఆఖరికి స్వేచ్ఛను సాధించారు. ఎలాంటి పాలన కావాలో ఆలోచించి ప్రజాస్వామిక విలువలతో కూడిన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వీటన్నింటినీ ఒక్కమాటతో తిరస్కరిస్తారా! ప్రాణత్యాగాలను విస్మరించి, స్వాతంత్ర్యాన్నే కించపరుస్తారా? అవును, మీరు రాజుల కాలం నాటి బానిస భావాల వారసులు. నేటి ఆధునిక ప్రజాస్వామిక విలువలంటే చిర్రెత్తుకొస్తారు. మనుధర్మం తప్ప రాజ్యాంగమంటే మీకు ద్వేషం. మొన్న మొన్నటి వరకూ మన మూడు రంగుల జెండాను కూడా ఎగరేయడానికి పూనుకోలేదు కదా! ఎందుకెగరేస్తారులే! అసలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటే కదా! కాదు కాదు, ఆ పోరాటానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి వంతపాడిన వారసులు మీరనే విషయం ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం. పోరాడటం, త్యాగం చేయటం మీకు గిట్టని విషయం. ఒక్కసారి చరిత్రను చూడండి. లక్షలాది మంది ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలేవీ లేక ఐక్యంగా పోరాడి పొందిన ఫలితాన్నే ఈ భగవత్, వారి వారసులూ అనుభవిస్తున్నారు. చరిత్రనూ తొక్కేయాలని చూస్తున్నారు. భిన్నమతాల వారు వీరులుగా పోరాడి మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిపోయారు. మీరేమో మతతత్వ కళ్లతో చూసి మాట్లాడుతున్నారు. పాశ్చాత్య దేశాల ఫాసిస్టు ఉద్యమాల నుంచి ప్రేరణ పొందిన సంఘ్ సేవకులు ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛను భరించడం కష్టంగానే ఉంటుంది మరి! స్వేచ్ఛ కోసం జరిగిన సమరంలో అసలు పాల్గొనని వారి మాటలు ఇంతకన్నా గొప్పగా ఏం ఉంటాయి. చెప్పుకోవటానికి సచ్చరిత్రే లేనివాళ్లు హీనులుగా మిగిలిపోక తప్పదు. దేశభక్తి గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే వీళ్ల అసలు దేశభక్తి ఇది. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని కించపరచడం, దేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించ నిరాకరించడం వీరి నైజం. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. నాడీ, నరం, బుద్ధి, కండ, శరీరంలోని అణువణువు పరమత, ప్రాంత, భావ ద్వేషంతో నిండిపోయిన ఒక సంఘీ చెబుతున్న మాట. ఉరిశిక్షలు అనుభవించిన వాళ్లు దాదాపు అందరి పేర్లు అంటే భగత్ సింగ్, చంద్రశేఖర్, రాజ గురు, సుఖదేవ్, ఖుదీరాం బోస్, ఎఎఫ్ ఖాన్ మొదలైన పేర్లు మనకు తెలుస్తూనే ఉంటాయి. వీళ్లు చెప్పేది స్వతంత్ర పోరాటంలో ఉరి తీయబడిన భారతీయులు 3.50 లక్షలు అని. ఇది ఎంత హాస్యాస్పదమో ఒకసారి చూడండి. పైగా భారతీయులు తమ జాతి విముక్తి కోసం అంతమందిని కన్న దేశం మనదే అంటూ తెగ గర్వపడిపోతున్నారు. సింగపూర్‌లో కొంత కాలం భారతీయులకు ఉద్యోగాలు ఇచ్చేవారు కాదని వింటాం. కారణం ఏంటంటే బ్రిటిష్ ప్రభుత్వంలో ఉద్యోగాలు చేసినవాళ్లు భారతీయులు. అంటే స్వదేశీయులకు, స్వదేశానికీ వ్యతిరేకంగా పనిచేసే స్వభావం భారతీయులకు ఉంటుందంటూ అక్కడ కొంతకాలం భారతీయులకు ఉద్యోగాలు ఇచ్చేవారు కాదట. ఇక్కడి సంఘీలు ప్రశ్నించే వాళ్లు ఎవరూ ఉండరని ఇలా తప్పుడు రాతలు రాసుకుంటూ పోతారు. కొసమెరుపు ఏంటంటే.. ఉరికంబం ఎక్కినవాడే కాదు, భారత స్వాతంత్ర్యం కోసం కనీసం జైలుకెళ్లిన వాళ్లు కూడా ఒక్కడంటే ఒక్క సంఘీ లేడు. వెళ్లిన ఒక్కడు క్షమాపత్రం రాసి తిరిగి వచ్చేశాడు, జీవిత కాలం పాటు పెన్షన్ తీసుకున్నాడు. అదీ సంఘీల నిస్సిగ్గు జీవనం. అలాంటి మహోన్నత పోరాటంలో తమకు పాత్ర లేదే అని సిగ్గుపడటం మానేసి ఇతరులు చేసిన ఘనతకు తామెక్కువ విజయోత్సహాలు జరిపేసుకుని ఆ ఘనతను తమ ఖాతాలో వేసేసుకునే నిస్సిగ్గు జట్టే సంఘీలంటే.





కొన్ని దృశ్యాలు.. వణుకు పుట్టిస్తాయి. అక్షరాలవసరం లేకుండానే భావోద్వేగాలకు గురిచేస్తాయి. అలాంటి ఓ వీడియోనే ఇప్పుడు ఇన్‌స్టా లో వైరలవుతోంది. ఊకదంపుడు ఉపాన్యాసాలిచ్చే నేతలు.. గుర్తించాల్సిన దృశ్యాలను కూడా కళ్లుండీ చూడలేని కబోధుల్లా వ్యవహరిస్తున్నప్పుడు చెప్పుకోవాల్సిన రూరల్ స్టోరీ ఇది. అత్యాధునిక వంతెనలు, మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు అంటూ ఓవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతుంటాయి. ఇంకోవైపు, కనీసం నదులు, వాగులు, చెరువులు దాటడానికి వీల్లేని పరిస్థితుల్లో కొన్ని ప్రాంతాలలాగే ప్రభుత్వాల దృష్టికి నోచుకోకుండా గ్రహణం పడతాయి. ఈ కాంట్రాస్ట్ సోషల్ మీడియాలోనూ, మీడియాలోనూ హైలెట్ అవుతుంది. సమసమాజం గుర్తిస్తుంది. అయ్యో పాపమనుకుంటుంది. కానీ, అభివృద్ధి చేయాల్సినవారు, అదే అభివృద్ధి గురించి ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే నేతలకు మాత్రం కనబడదు, వినబడదు. అలాంటి ఘటనకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు కనీస మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మనమెక్కడున్నామనే ప్రశ్నను మన ముందుంచుతోంది.

## దారమే.. ఆధారం..

# నది దాటితేనే చదువు!!

ఉత్తరాఖండ్‌లో పాఠశాల విద్యార్థినులు ఓ రోప్‌కు ట్రాలీని తగిలించి నదిని దాటుతున్న ఓ ఆందోళనకరమైన వీడియో. అదిప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ టాపిక్‌గా మారింది.

ఉత్తరాఖండ్‌లోని కుమావున్ ప్రాంతం నుంచి తమ బడికి వెళ్లడానికి విద్యార్థినులు ఎదుర్కొంటున్న కష్టాలను కళ్లకు కట్టే వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వాళ్ల కష్టాలను కళ్లకు కట్టేలా ఉన్న వారి దినచర్యకు సంబంధించిన ఆ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పుడు ట్రెండింగవుతోంది. ఓవైపు హిమాలయ పర్వతాలు, మధ్యలో నది.. పాఠశాలకు చేరాలంటే నది దాటి తీరాల్సిన పరిస్థితి. అలాంటి చోట ఓ రోప్ ద్వారా ఇద్దరు విద్యార్థినులు ఓ ట్రాలీని దానికి తగిలించి నది దాటుతున్న వీడియో ఇప్పుడు ఉత్తరాఖండ్ ప్రభుత్వ పెద్దలకు తలబొప్పి కట్టిస్తోంది. నిత్యం ఇదే పరిస్థితిలో విద్యార్థులు ఈ రోప్ ఉన్న ట్రాలీ ద్వారానే పాఠశాలకు చేరుకోవాల్సి ఉండగా.. చూసేందుకే భయానకంగా కనిపిస్తున్న ఆ వీడియో చూసినవారు.. ఇదేనా ప్రభుత్వాలు చెబుతున్న అభివృద్ధి అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

కామెంట్ బాక్సులో ఇన్‌స్టా యూజర్స్ విభిన్నరకాల కామెంట్ చేస్తున్నారు. మనమసలున్నది 2025లోనేనా.. లేక, ఇంకా అనాగరిక కాలంలోనా అన్నట్టున్నాయి ఆ వ్యాఖ్యలు. అభివృద్ధిని ప్రశ్నిస్తూ ఐసే హోగా వికాస్ అంటూ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీని ప్రశ్నిస్తున్నారు.

మారుమూల ప్రదేశాల్లో మౌలిక సదుపాయల గురించి ఈ వీడియో ఇప్పుడు పెద్ద చర్చకే దారితీస్తోంది. అత్యంత దురదృష్టకరమైన పరిస్థితి ఇది అంటూ కొందరు వ్యాఖ్యానిస్తే.. మరికొందరు స్థానిక ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రికి ఆ వీడియోను ట్యాగ్ చేసి చూపించండంటూ ఫైర్ అవుతున్నారు.

గత ఏడాది ఆగస్ట్ ప్రారంభంలో కూడా ఇదే ఉత్తరాఖండ్ రాష్ట్రంలో టెహ్రీగర్వాల్‌లోని సోంథర్‌కు చెందిన 18 ఏళ్ల సౌరభ్ పన్వర్ అనే వ్యక్తి సాంగ్ నది దాటడానికి బ్రిడ్జ్ లేకపోవడంతో ఇలాంటి రోప్ వేకు ట్రాలీని తగిలించి వెళ్తున్న దృశ్యాలు వైరలయ్యాయి. జస్ట్ ఓ తాత్కాలిక పరిష్కారంగా మాత్రమే ఏర్పాటు చేసి, ప్రమాదకర స్థితిలో ఉన్న ఓ రోప్ వే అక్కడి వందలాది గ్రామస్థులు నిత్యం నదిని దాటేందుకు ఏకైక మార్గం కావడం పలు విమర్శలకు తావిచ్చింది. ఆ సమయంలో రోప్ వేపై ట్రాలీలో ప్రయాణించిన పన్వర్ కూడా ఇదిగో ఈ విద్యార్థుల్లాగే తాను కళాశాలకు వెళ్లాలంటే నది దాటాల్సిందేనని చెప్పుకొచ్చాడు.

నెలలు గడుస్తున్నాయి. సోషల్ మీడియాలో, మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. సమాజమంతా దుమ్మెత్తిపోస్తోంది. కానీ, పాలకుల్లో చలనం మాత్రం లేదు.

డెహ్రాడూన్ శివార్లలోని మాల్దేవ్తాకు 10 నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న దాదాపు 70 గ్రామాల ప్రజానీకానికి ఇక్కడి నదిని దాటందే బతుకులు వెళ్లని పరిస్థితి. ఒకవైపు డెహ్రాడూన్, ఇంకోవైపు టెహ్రీ మధ్యన నది. ఇలా ఇక్కడి నదిని దాటాలంటే బ్రిడ్జ్ మార్గంగానీ, బోటింగ్ గానీ అందుబాటులో లేకపోవడంతో ఇదిగో ఇలా రోప్ వేలో తాడుకు ట్రాలీ కట్టి దాటాల్సిన దయనీయ స్థితి ఇక్కడి ప్రజానీకానిది. ఈమధ్య కురిసిన భారీవర్షాలతో ఈరోప్ వే మరింత క్రాస్‌గా మారిపోయి ప్రమాదకర స్థితిలో కనిపిస్తోంది. ఇలాంటి రోప్ వేలో తాడు కట్టిన ఓ ట్రాలీలో విద్యార్థినీ, విద్యార్థులు, ఇక్కడి గ్రామాల ప్రజలు నది దాటే ఈ దృశ్యం.. ఇంకా గ్రామీణ కొండ ప్రాంతాల్లో జనం ఇబ్బందులెలా పడుతున్నారో కళ్లకు కట్టేది.

నది ప్రమాదకరంగా ఉప్పొంగినప్పుడు ఇక్కడి విద్యార్థినీ, విద్యార్థులు స్కూల్స్, కళాశాలలకు వెళ్లడం కూడా మానేస్తుంటారని పన్వర్ చెప్పిన మాట. ఎందుకంటే, రోప్ వే ద్వారా ట్రాలీలో వెళ్తున్నప్పుడు కేవలం రెండడుగుల దూరంలో నది ప్రవహిస్తుందంటే.. ఎంత ఎత్తులో ఎంత లోతుతో ప్రవహిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ నది దాటకుండా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలంటే కనీసం 15 నుంచి 20 కిలోమీటర్ల ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. అంత పెద్ద ఎత్తైన కొండలపై నుంచి వర్షాకాలంలో జారుతుంటే ట్రెక్కింగ్ మరింత కష్టం. మరోవైపు అడవి జంతువుల భయమొకటి. ఈ క్రమంలో ఉత్తరాఖండ్ లో నదులను దాటే క్రమంలో విద్యార్థుల వీడియోపై భిన్నరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతూనే.. ప్రభుత్వ తీరుపై ఫైర్ అవుతున్నారు.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## తండేల్ అంటే ఓనర్ కాదు..లీడర్!





ఈ ఫిబ్రవరి 7న రాబోతున్న సినిమా తండేల్. నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటించారు. చందూ మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ రూపొందించింది. ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్‌లో ప్రేమ, దేశభక్తి, ఎమోషన్స్‌కి పెద్ద పీట వేశారు. 'తండేల్' అంటే అర్థం ఏమిటో వివరించారు. తండేల్ అంటే ఓనర్ కాదు.. లీడర్ అని చెప్పడంలో ఈ సినిమా లోని హీరో క్యారెక్టరైజేషన్ ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పింది. చైతూ-సాయి పల్లవి మధ్య కెమిస్ట్రీ.. మరోసారి బాగా వర్కవుట్ అయినట్టు కనిపిస్తోంది. విజువల్స్ బాగున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన ఆర్.ఆర్ ఇంకా బాగా కుదిరింది. నడి సంద్రాన నావతో పోరాటం, గగుర్పాటుకు గురి చేసేలా ఉంది. ట్రైలర్‌లో కథేమిటో చూచాయిగా చెప్పే శారు. ఆ వరల్డ్‌లోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లారు. డైలాగ్స్ బాగున్నాయి. సాయి పల్లవి మరోసారి విజృంభించేసి ఉంటుం దని ట్రైలర్‌లోని కొన్ని షాట్లు చూస్తుంటే అర్థ మవుతోంది. చైతూ కెరీర్‌లో చాలా ముఖ్యమైన సినిమా ఇది. కాబట్టి తను కూడా కష్టపడ్డాడు. సాయిపల్లవి లాంటి నటి ఎదురుగా ఉంటే.. నటనలోనూ తప్ప కుండా వైవిధ్యం చూపించాల్సిందే. చైతూ క్యారెక్టర్‌లో అది కనిపిస్తోంది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ట్రైలర్‌తో అవి ఇంకాస్త పెరిగాయి.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

ఇండస్ట్రీకి వెళ్లిన కొత్తలో ఏడాది కూడా ఉండలేదని తన బంధువులంతా హేళన చేసారట. సినిమాల్లో రాణించాలంటే చాలా ట్యాలెంట్ ఉండాలి. అది అందరితో సాధ్యం కాదు. ఇవన్నీ నీకెందుకు అన్నట్లు మాట్లాడారట. వాళ్లు అన్నట్లు గానే కెరీర్ ప్రారంభమైన కొత్తలో బంధువుల నుంచి చాలా మాటలు పడాల్సి వచ్చిందట. అయితే ఇప్పుడు తానెంత బిజీగా ఉన్నానో కూడా వాళ్లంతా ఇప్పుడు చూడాల్సిన సమయం వచ్చిందని అంటోంది. ఆనాడు విమర్శించినోళ్లే నేడు ప్రశంసించాల్సిన బాధ్యత కూడా ఉంది. కానీ ఆ పని చేయడం లేదు. ఇప్పుడు కొత్తగా సక్సెస్ అయ్యాననే అక్కసుతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎదగనీయకుండా ఎక్కడో బయట వాళ్లు కాళ్లు లాగాల్సిన పనిలేదు. ఇంట్లో ఉన్న వారే అప్పుడప్పుడు ఇలాంటి చర్యలకు దిగుతారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. అమ్మడు తొలుత మాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. అటుపై కన్నడ, తమిళ్ లో సినిమాలు చేసింది. 'జెర్సీ' సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాతో నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది. అప్పటి నుంచి తెలుగు సినిమాల్లో కొనసాగుతోంది. ఇటీవలే 'డాకు మహారాజ్' తో మరో సక్సెస్ ఖాతాలో వేసుకుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

సినిమా ఇండస్ట్రీ అంటే గ్యారెంటీ లేని లైఫ్. అందుకే సినిమాల్లోకి వెళ్తానంటే ఎవరూ ప్రోత్సహించరు. బాగా చదువుకుని మంచి ఉద్యోగం చూసుకుని పిల్లని చూసి పెళ్లి చేసుకుని స్థిరపడు అని ఓ సలహా ఇస్తారు. అలా వాళ్ల మాట కాదని సినిమా ల్లోకి వచ్చి సక్సెస్ అయితే పర్వాలేదు. లేదంటే విమర్శలు... అవమానాలు... హేళనలు ఎన్నో ఎదుర్కోవాల్సి ఉంటుం ది. ఏ భాషలోనైనా ఫెయిలైన ప్రతీ ఒక్కరు ఈ ఫేజ్ చూడా ల్సిందే. కన్నడ బ్యూటీ శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇలాంటి విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపింది.



# బంధువులకు ఇచ్చి పడేసింది!




## కియరా గ్లామర్ ఫైర్..!

అందాలభామ కియరా అద్వాని ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలైతే చేస్తుంది కానీ అందుకు తగినట్టుగా సక్సెస్‌లు మాత్రం అందుకోవట్లేదు. ముఖ్యంగా సౌత్ పై ప్రేమ కొద్దీ అమ్మడు చేస్తున్న ప్రయత్నాలన్నీ రివర్స్ అవుతున్నాయి. అటు బాలీవుడ్‌లో బిజీగా ఉన్నప్పుడే మహేష్‌బాబు కోసం భరత్ అనే నేను సినిమా చేసిన కియరా ఆ సినిమాతో హిట్ అందుకుంది. ఐతే ఆ నెక్స్ట్ సినిమా రామ్ చరణ్‌తో వినయవిధేయరామ చేసింది. ఆ సినిమా రిజల్ట్ అందరికీ తెలిసిందే. ఐతే మళ్లీ కొద్దిపాటి గ్యాప్‌తో మరోసారి రామ్ చరణ్ తోనే సినిమా చేసింది కియరా అద్వాని. గేమ్ ఛేంజర్ లో రామ్ చరణ్ తో అమ్మడు కలిసి నటించింది. ఆ సినిమా ఫలితం కూడా అమ్మడిని నిరాశ పరచింది. మరోపక్క బాలీవుడ్ లో లాస్ట్ ఇయర్ ఏ సినిమా పడలేదు. ఈ ఇయర్ వార్ 2 ఉంది. యష్ టాక్సిక్‌లో కూడా కియరా హీరోయిన్‌గా చేస్తుంది. ఈ రెండు సినిమాల మీదే కియరా తన హోప్స్ పెట్టుకుందని చెప్పొచ్చు. ఇక సినిమాలతో సంబంధం లేకుండా అమ్మడు ఫోటో షూట్స్‌తో గ్లామర్ అప్పీల్ చేస్తుంది. కియరా సోషల్ మీడియా ఫోటోస్‌కి సూపర్ డిమాండ్ ఉంటుంది. లేటెస్ట్‌గా అమ్మడు వైట్ కలర్ డ్రెస్ అది కూడా అక్కడక్కడ స్పెషల్ డిజైన్‌తో ఉంది. ఈ ఫోటోస్ చూసిన ఎవరైనా సరే కియరా మాయలో పడిపోక తప్పదు. మామూలుగా అయితే పెళ్లయ్యాక ఎవరికైనా అందం తగ్గుతుందని అంటారు కానీ కియరా విషయంలో అది రివర్స్ అవుతుంది.

రోజు రోజుకి అమ్మడి అందం రెట్టింపు అవుతున్నట్టు ఉంది. సినిమాలు సరిగా ఆడకపోయినా తన ఫోటో షూట్స్‌తో ఆడియన్స్ హృదయాల్లో సూపర్ హిట్ అనిపించుకుంటుంది అమ్మడు. వార్ 2, టాక్సిక్ ఈ రెండు సినిమాలతో కియరా మళ్లీ తిరిగి సక్సెస్ ట్రాక్‌లోకి రావాలని చూస్తుంది. మరి ఈ సినిమాలైనా కియరాని కాపాడుతాయేమో చూడాలి. ఐతే వరుస సినిమాలు నిరాశపరుస్తున్నా తన ఫోకస్ ఏమాత్రం తగ్గించట్లేదు కియరా. అటు సినిమాలు ఇటు ఫోటో షూట్స్ అంటూ రెగ్యులర్ గా ఆడియన్స్ తో టచ్ లో ఉంటుంది. కియరా కష్టాన్ని చూసిన ఎవరైనా సరే హిట్టు పడాలని కోరతారు. తప్పనిసరిగా అమ్మడికి రాబోయే రోజులు కలిసి వచ్చేలా ఉన్నాయని చెప్పొచ్చు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...





# బండ్లు ఓడలు..ఓడలు బండ్లు!!

"కౌపీన సంరక్షణార్థం" అని బాగా వాడుకలో ఉన్న సంస్కృతం సామెత. అందరికీ తెలిసిందే అయినా.. గోచిగుడ్డ నుండి మొదలయిన అంతులేని మహా సంసార ప్రయాణం కథ మళ్లీ మళ్లీ తెలుసుకోదగ్గదే.



ఒకానొక ఊరు. పంటపొలాలతో, ధన ధాన్యాలతో పచ్చగా, హాయిగా ఉంది. ఊరిని ఆనుకుని ఊరికి కొండగుర్తుగా ఒక కొండ. ఆ కొండ మీద ఒక శిథిలాలయ మంటపం. ఎక్కడ నుండి, ఎప్పుడొచ్చాడో తెలియదు కానీ ఒక సన్యాసి వచ్చి ఆ మంటపం కింద గూడు కట్టుకున్నాడు. పశువుల కాపర్లు ఎవరయినా కొండమీదికి వెళ్లినప్పుడు తాము తెచ్చుకున్న సద్ది మూట విప్పి ఓ ముద్ద పెడితే తింటాడు. పెట్టకపోతే పెట్టాలని చేయి చాచి అడగడు. వచ్చిన వారే దయదలిచి ఒక కాయో పండో ఇచ్చి వెళ్లేవారు.

సన్యాసికి ఒంటి మీద ఒక గోచీ గుడ్డ, కొమ్మకు ఆరేసుకున్న మరో గోచీ గుడ్డ తప్ప ఇంకేలాంటి స్థిర చరాస్తులు లేవు. ఉండాలని కోరుకోలేదు. కాలం అలా గడిచిపోతూ ఉంటే కాలం ఎందుకవుతుంది?

ఆరేసుకున్న గోచీ గుడ్డను ఎలుకలు కొరకడంతో సన్యాసికి ఎక్కడలేని కష్టాలు మొదలయ్యాయి. సర్వసంగ పరిత్యాగి ఈ విషయం మీద లోలోపల చాలా నలిగిపోతున్నాడు. ఒక శుభ ముహూర్తాన తన బాధను పశుల కాపర్లతో పంచుకున్నాడు. అయ్యో స్వామీ! ఇదా మీ బాధ? అందుకా ఈ మధ్య దిగులు దిగులుగా ఉన్నారు? రేపొద్దున కొండ మీదికి వచ్చేప్పుడు ఒక పిల్లిని తీసుకొచ్చి ఇక్కడ వదిలి వెళతాం. మీ సమస్యకు శాశ్వత పరిష్కారం అన్నారు. అన్నట్లుగానే పొద్దున్నే చంకలో పిల్లిని పెట్టుకుని వెళ్లారు. సన్యాసి రెండ్రోజులు గమనించాడు. ఎలుకలు మాయం. గోచీ గుడ్డ భద్రం.

అయితే ఆ కొండమీద సరయిన ఆహారం దొరకక పిల్లి మూడో రోజుకు కళ్లు తేలేసింది. సన్యాసి మనసు చివుక్కుమంది. మళ్లీ పశుల కాపర్లనే సలహా అడిగాడు. ఒంటరి పిల్లి బిక్కు బిక్కుమంటూ ఉంది. పైగా పిల్లికి పాలుపోయాలి.. అని రెండో పిల్లిని కూడా ప్రవేశపెట్టారు. పాల క్యాన్, గిన్నెలు, ప్లేట్లు ఎలాగూ ఉంటాయి. వారం తిరగ్గానే సన్యాసి మళ్లీ మొహం వేలాడేసుకుని ఉండడాన్ని పశుల కాపర్లు జీర్ణించుకోలేకపోయారు. ఏమి స్వామీ! ఏమయ్యింది? అని అడిగారు. జంట పిల్లులు మ్యావ్ మ్యావ్ అని నా దుంప తెంచుతున్నాయి.. అని బాధపడ్డాడు. మరుసటి రోజు ఉదయాన్నే రెండు అడవి కుక్కలను ప్రవేశపెట్టారు. తోడుగా రెండు ఆవులను కూడా ముందు జాగ్రత్తగా తెచ్చి కట్టి పడేసి, ఒక గుడిసె, పందిరి వేసి పెట్టారు.

సన్యాసి ఇవన్నీ చూసుకోలేక తపస్సు దారి తప్పుతోందని గ్రహించి ఊళ్లో ఈ విద్యలన్నీ తెలిసిన ఒక అనాథ యువతిని కొండమీద ఆశ్రమంలో ప్రవేశపెట్టారు. ఒకానొక కారు చీకటి కమ్మిన వేళ ఆ యువతిలో సన్యాసికి కాంతి రేఖ కనిపించింది. అంతే పెళ్లి కాకుండానే శోభనం జరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఊరి పెద్దలు పంచాయతీ పెట్టి శాస్త్రోక్తంగా పెళ్లి చేశారు. ఇంత సంసారంతో ఈ కొండమీద ఉండలేను.. కొండ దిగి ఊళ్లోకి వచ్చేస్తాను అని సంసారిగా మారిన సన్యాసి చేసిన డిమాండును ఊరి జనం పెద్ద మనసుతో అంగీకరించారు. ఊరవతల అవుటర్ రింగ్ రోడ్డును ఆనుకుని సరికొత్త సంసారి సువిశాలమయిన గృహాశ్రమం కట్టుకుని పిల్లాపాపలతో, గొడ్డూ గోదాతో హాయిగా కాలం గడపసాగాడు. ఈ సన్యాసి సంసారిగా ఎందుకు మారాడు అని ఎవరయినా అడిగితే.. ఆరోజు నుండి



"కౌపీన సంరక్షణార్థం" అని సమాధానం వస్తోంది. కౌపీనం అంటే గోచీ గుడ్డ. సంరక్షణార్థం అంటే రక్షించుకోవడానికి. గోచీ గుడ్డను రక్షించుకోవడానికి జరిగిన సన్యాసి పరిణామక్రమ సిద్ధాంతమిది.

**సందర్భం:- కౌపీన సంరక్షణార్థం సన్యాసేమో కాషాయం వదిలి.. సాంసారం బాటపడితే.. డ్రగ్స్ కేసు వార్తల్లో పేరుపొందిన నటి మమతా కులకర్ణి ప్రస్తుత మహాకుంభమేళాలో ప్రాపంచిక సుఖాలు వదిలి...కాషాయం స్వీకరించింది.**

"ఓడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలవుతాయి".

2016 లో కెన్యాలో రెండువేల కోట్ల డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో ఆమె భర్త విక్కీ గోస్వామితోపాటు అరెస్ట్ అయ్యింది మమతా కులకర్ణి. అది గతం. గతం గతః. ఈమె ఆమె కాదు. ఈమె శ్రీయామై మమతానందగిరి. ఈమె ఈమే. డ్రగ్స్ కేసు నుండి బయటపడడానికే తెలివిగా సన్యాసం స్వీకరించిందని అనుకునేవారి కళ్ళు పేలిపోవ్వా! "..ఉన్నావా! అసలున్నావా!.. ఉంటే కళ్ళు మూసుకున్నావా?"

-పమిడికాల్వ మధుసూదన్



టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, చీపురు పల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు సోదరుడు కిమిడి సత్యన్నారాయణ మృతి చెందడంతో రేగిడిలో గల ఆయన స్వగృహంలో భౌతిక కాయాన్ని టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీ రమణ మాదిగ సందర్శించి నివాళులర్పించారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## బగ్గును కలిసిన సిరిపురం

**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనరు గొద్దు భాగ్యలక్ష్మి, కిల్లి లక్ష్మణరావు, చింతాడ భారతి, సురపతి కృష్ణారావు, పైల కావ్య, జగన్మోహన్ తదితరులున్నారు.



## పాతపట్నంలో ఫీజుల దందా..!



**(సత్యంన్యూస్, పాతపట్నం)**

పాతపట్నంలో పలు ప్రవేట్ సూళ్ల దందాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. కొన్నిస్కూళ్లకు కనీసం పిల్లలు ఆడేందుకు ఆటస్థలాలు లేకపోయినా, ఫైర్ సేఫ్టీ లేకపోయినా, మరుగుదొడ్లు లేకపోయినా పిల్లల నుంచి పీజులు అడ్డగోలుగా వసూళ్లు చేతున్నారు. టైంకి పీజులు కట్టకేలపోయిన పిల్లలకు నరకం చూపిస్తున్నారు. తల్లిదండ్రులు సమయం కావాలని కాళ్ళు పట్టుకున్న కనీసం కనికరం లేకుండా బయటకు పంపిస్తున్నారు. ఇలాంటి ఘటననే పాతపట్నం మండల పరిధిలో చోటుచేసుకుంది. పాతపట్నం శివశంకర్ కాలనీకు చెందిన ఒక బైక్ మెకానిక్ దాసరి సోమేశ్వరరావు తన ఇద్దరు కుమార్తెలను ఆల్ ఆంధ్రరోడ్డు సూర్యనారాయణపురం వద్ద ఉన్న అక్షర స్కూల్లో చదివిస్తున్నాడు. ఇటీవల డిసెంబర్ 15లోగా తమ ఇద్దరు కుమార్తెల ఫీజు కట్టమని స్కూల్ యాజమన్యం చెప్పారన్నారు. అప్పుడు డబ్బులు లేకపోవడంతో ఇప్పుడు కట్టడానికి వెళితే 30 రోజులు లేటుగా కట్టినందుకు ఇద్దరు కుమార్తెలకు ఒక్కక్కరికి రూ.1200 చొప్పున రూ.2400 ఆదనంగా వసులు చేశారని విలేకరులు తెలిపారు. ఇదే విషయంపై ఎంఈవోకు కూడా ఫిర్యాదు చేసానని సోమేశ్వరరావు తెలిపారు. స్కూల్‌పై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సోమేశ్వరరావు తెలిపారు.

## కుక్కల దాడిలో 6 మేకపిల్లలు మృతి

**(సత్యంన్యూస్, లావేరు)**

మండలం తామాడలో వీధి కుక్కల దాడిలో 6 మేకపిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాసి రాము మేకల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి పక్కన కంచె వేసి అందులో మేక పిల్లలను పెంచుతున్నారు. బుధవారం తెల్లవారుజామున గ్రామంలో కుక్కలు తొమ్మిది మేకపిల్లలపై దాడి చేశాయి. వీటిలో ఆరు మేక పిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో జీవనాధారం లేకుండా పోయిందని వాపోయారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, మేక పిల్లల మృతితో తీవ్ర నష్టం జరిగిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని రాము కోరుతున్నారు. కుక్కలు పెద్ద సంఖ్యలో గ్రామ వీధుల్లో సంచరిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు.



## టెన్త్‌క్లాస్ ప్రజ్ఞా వికాస్ పరీక్షలు పోస్టర్ ఆవిష్కరణ



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్ష వచ్చేనెల 11, 12, 13 తేదీల్లో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో విస్తారంగా ఈ పరీక్ష నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారావు తెలిపారు ఈ ప్రజ్ఞ వికాస్ పరీక్షకు ఎంట్రన్స్ ఫీజు రూ.30లు ఉంటుందన్నారు. టెన్త్ క్లాస్ సిలబస్ మొత్తం ఇందులో ఉంటుందని మ్యాథ్స్ 20 మార్కులు, సోషల్ స్టడీస్ 20మార్కులు, ఇంగ్లీష్ 20మార్కులు, ఎన్ఎస్ 10 మార్కులు, ఫిజికల్ సైన్స్ 10 మార్కులు, తెలుగు 10మార్కులు, హిందీ 10మార్కులు, మొత్తం మార్కులు 100కి ఈ విధంగా పేపర్ ఉంటుందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు ఎస్ఎఫ్ఐ పోరాటాలనే కాదు పరీక్షల్లో చదువుల్లో కూడా ముందు ఉంటామంటూ విద్యార్థులకి మొదటి మెట్టు అయినటువంటి 10వ తరగతి పరీక్ష ఎలా అటెండ్ అవ్వాలో ఎలా రాయాలో తెలియజేయడానికి ఈ పరీక్ష పెడుతున్నామన్నారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఈ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సంక్షేమ ఫలాలు అందరికీ అందిస్తాం

(సత్యంన్యూస్, టెక్కలి)

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అందరకీ చేరువ చేస్తామని ప్రజలకు వివరించారు. వివిధ సమస్యలపై మంత్రికి ప్రజలు వినతి పత్రం ఇచ్చిన వెంటనే వాటని పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులను ఆదేశించారు. నాలుగు మండలాల అధికారులు హాజరయ్యారు.



# పౌరసరఫరాల కమిషనర్‌ను కలిసిన ఎండీయూ ఆపరేటర్లు



(సత్యంన్యూస్, విజయవాడ)

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్‌ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఎండీయూ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాజా శ్రీనివాసరావు, మన్యం జిల్లా అధ్యక్షులు మన్మథరావు సంఘం తరపున మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీలోగా విడతల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎండీయూ ఆపరేటర్స్‌కు సంబంధించిన వెహికల్స్ ఇన్సూరెన్స్ టైం అయిపోయిందని, ఒకటో తేదిన రేషన్ డిస్ట్రిబ్యూషన్‌కి వెళ్లేలోపు ఆ ఇన్సూరెన్స్ సమస్య పరిష్కరించి ప్రభుత్వం వారు చెల్లించేలా తగు ఉత్వర్వులు ఇవ్వాలని, అలాగే ప్రమాదాలే కాకుండా ఎండీయూ ఆపరేటర్ సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని కోరారు. అంగన్‌వాడీ మిడ్ డే మీల్స్‌కి సంబంధించి 2023 నుంచి సుమారు రెండేళ్లుగా ఆపరేటర్స్‌కు ఇస్తామన్న కమిషన్ ఏరియర్స్‌ను వెంటనే ఇప్పించాలని కోరారు. జీతాలు కూడా ఒకటో తేది నాటికి ఇచ్చేలా చూడాలని, వ్యవస్థ స్థాపించిన నుంచి చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతున్నారని, ఎండీయూ ఆపరేటర్లకు ఇస్తున్న వేతనం పెంచేలా చూడాలని కోరారు. కమిషనర్‌ను కలిసినవారిలో రాష్ట్ర నాయకులతో పాటు ఎండీయూ ఆపరేటర్స్ మన్యం జిల్లా కార్యవర్గ సభ్యులు సీతంపేట నుంచి ప్రభాస్, అప్పలనాయుడు, సాలూరు మండలం నుంచి మురళి తదితరులు ఉన్నారు.

## కాంట్రాక్టు వాహనం కోసం దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 0-18 సంవత్సరాల వయస్సు గల స్కూల్, అంగన్వాడీ పిల్లలకు చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో, టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఉన్న బాలభవిత కేంద్రాలకు పిల్లలను తీసుకుని వచ్చి మరల తీసుకువెళ్లడానికి రెండు హైరింగ్ (కాంట్రాక్టు) వాహనాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వి.బాలమురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనం 7 నుంచి 8 సీట్ల వరకు ఉండాలని తెలిపారు. వాహనానికి నెలకు రూ.60వేలు చెల్లిస్తామని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 81064 19580, 83330 47999 నెంబర్లకు సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.



ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ ఐఎల్‌ఎం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూల్లో కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ (కో-ఎడ్) విద్యార్థులు 51 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీతో పాటు ఉద్యోగ లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్.రాజు, అధ్యాపక బృందం అభినందించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# 'సౌత్ ఇండియా'పై నెట్‌ప్రాక్టీస్

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నం చేశారు. షాపింగ్ మాల్‌కు 2022 జనవరి 11న ఎన్‌వోసీని జారీచేసిన అగ్నిమాపక శాఖ షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన కనీస సౌకర్యాలు, పరికరాలు లేవని గుర్తించకుండా ఎలా ఆక్యుపెన్సీ కోసం ఎన్‌వోసీ ఇచ్చారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### మాక్ డ్రిల్ ఒక ఫోటో సెషన్

ప్రమాదం జరిగితే ఒకలా.. లేకుంటే మరోలా అగ్నిమాపక శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. స్మోక్ ఎక్స్‌ట్రాక్షన్ సిస్టమ్ లేకపోవడం ప్రమాదానికి కారణమని చెబుతున్న ఫైర్ అధికారులు ఎన్‌వోసీ సమయంలో కళ్లు మూసుకున్నారా అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఏడాది విపత్తు నిర్వహణ సిబ్బంది జరిపే మాక్‌డ్రిల్ కేవలం అగ్నిమాపక శాఖ అధికారుల ఫోటో సెషన్‌గా మారిపోయిందని విమర్శలున్నాయి. మాల్స్, ఆసుపత్రులు, పాఠశాలు, బహుళ అంతస్థుల భవనాల వద్ద విపత్తు సంభవిస్తే దాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలని ప్రతి ఏడాది అగ్నిమాపక సిబ్బంది అక్కడ పనిచేసే సిబ్బందితో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహిస్తుంటారు. దీన్ని ఒక ఫోటో సెషన్‌గా అగ్నిమాపక శాఖ అధికారులు చూస్తుంటారు. తప్పదు కాబట్టి నిబంధనల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించామని చెప్పకోవడానికి ఏడాదికి ఒకసారి మమ అనిపిస్తుంటారు. సౌతిండియా షాపింగ్ మాల్‌కు ఎన్‌వోసీ జారీ చేసిన తర్వాత మాల్ ప్రాంగణంలో ఒక్కసారీ మాక్ డ్రిల్ నిర్వహించలేదు. ప్రమాదం జరిగిన తర్వాత షాపింగ్ మాల్ యాజమాన్యం ఎన్‌వోసీ జారీచేసిన తర్వాత మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు ధ్రువీకరణ, ఫోటోగ్రాఫ్‌లను సమర్పించడంలో యాజమాన్యం విఫలమైందని నోటీసుల్లో పేర్కొన్నారు. వాస్తవంగా మాక్ డ్రిల్ నిర్వహించాల్సిన బాధ్యత అగ్నిమాపక శాఖ అధికారులదే. మాక్‌డ్రిల్ ఎందుకు నిర్వహించలేదని, మూడేళ్లు యాజమాన్యానికి ఎందుకు నోటీసులు జారీ చేయలేదో అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పాలి. ప్రతి ఏడాది ఉగాది, దసరా, సంక్రాంతి సమయంలో ఇంటిల్లిపాది బిల్లులు కట్టకుండా షాపింగ్, మంత్లీలు, ప్రోటోకాల్ కోసం డబ్బులు డిమాండ్ చేసే అగ్నిమాపక శాఖ అధికారులు నిబంధనలు, ఫైర్ సేఫ్టీ పాటించని మాల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు సాహసిస్తారనే ప్రశ్న సామాన్యులు లేవనెత్తుతున్నారు.

### బాధ్యత ఎవరిది?

తెల్లవారు జామున షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం జరగడం వల్ల ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. ప్రమాదం సంక్రాంతి సమయంలో, లేదంటే వ్యాపార సమయంలో జరిగివుంటే బాధ్యత వహించేది ఎవరన్న ప్రశ్న తలెత్తుతుంది. మాల్‌లో పని చేస్తున్న అసంఘటిత కార్మికులు, వినియోగదారుల ప్రాణాలకు ప్రమాదం జరిగివుంటే బాధ్యత ఎవరు వహించేవారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రకమైన ప్రమాదం ఇదే చివరిదన్న భరోసాను అగ్నిమాపక శాఖ అధికారులు ఇవ్వలేరు. నగరంలో షాపింగ్ మాల్స్ లెక్కకు మించి ఉన్నాయి. అగ్ని ప్రమాదం జరిగితే బయటకు వచ్చే దారి లేని మాల్సే నగరంలో ఉన్నాయి. మాల్స్‌లోకి వెళ్లే మార్గం, వచ్చే మార్గం ఒక్కటే. ఇదే మాదిరిగా నగరంలో మాల్స్ అన్నీ నిర్మాణాలు చేశారు. నగరంలో మాల్స్ పెట్టి వ్యాపారం చేస్తున్న బహుళ అంతస్తుల భవనాలన్నింటికీ అనుమతులున్నా, వీటి నిర్మాణం ప్లాన్ ప్రకారం జరగడం లేదని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం వెలుగులోకి తీసుకువచ్చింది. నగరంలో మాల్‌లో ఎంట్రీ తప్ప ఎగ్జిట్ ఉండదు. వెళ్లిన మార్గంలోనే బయటకు రావాలి. నగరంలోని కార్పొరేట్ షాపింగ్ మాల్స్ అన్నీ ఐదంతస్తుల భవనాల్లోనే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీరికి నిబంధనలు పట్టవు. ప్లాన్ డీవియేషన్ చేయడానికి నగరపాలక సంస్థ ప్లానింగ్ అధికారులకు లంచాలు మట్టజెప్పుతున్నారు. ఫైర్ సేఫ్టీ మెజర్ లేకుండా వ్యాపారం చేయడానికి అగ్నిమాపక శాఖ అధికారులకు, మాల్‌లో వాహనాల పార్కింగ్ లేకుండా వ్యాపారం చేయడానికి పోలీసులకు మంత్లీలు ఇస్తున్నారు. ప్రమాదం జరిగినా, జరగకపోయినా ఎవరి వాటా వారికి అందిపోతుంది.

### అన్ని మాల్స్‌లో ఇదే పరిస్థితి

అగ్గిపెట్టిల్లా అన్నివైపులా మూసేసి ఎలివేషన్ కోసం మాల్ యాజమాన్యం తాపత్రయపడుతుంటారు. అగ్నిమాపక శాఖ అధికారులు పట్టించుకోకుండా వినియోగదారుల ప్రాణాలను పణంగా పెట్టి ఎన్‌వోసీలు జారీ చేస్తుంటారు. నగరంలో ఉన్న అన్ని షాపింగ్ మాల్స్‌కి ఇది వర్తిస్తుంది. ఐదంతస్తులు భవనాన్ని నిర్మించాలంటే సవాలక్ష నిబంధనలు తెరపైకి తేచ్చే ఆయా శాఖల అధికారులు షాపింగ్ మాల్స్ విషయంలో మాత్రం పట్టించుకోరు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రమాదాన్ని నియంత్రించడానికి ముందు భాగం నుంచి మాత్రమే ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. మాల్‌కు వెనుక భాగం నుంచి గానీ, ఇరువైపులు నుంచి వెళ్లడానికి మార్గం లేదు. అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం బహుళ అంతస్థుల భవనానికి ఇరువైపులా అగ్నిమాపక శకటం వెళ్లేందుకు వీలుగా సెట్‌బ్యాక్ విడిచిపెట్టాలి. నగరంలో ఉన్న షాపింగ్ మాల్స్‌లో అటువంటి నిర్మాణమే లేదు. అలా విడిచిపెట్టకపోయినా అగ్నిమాపక శాఖ అధికారులు వ్యాపారం చేసుకోవడానికి ఎన్‌వోసీ ఇచ్చేస్తున్నారు. నగరంలో ఉన్న షాపింగ్ మాల్స్ అన్నింటిలోనూ ఫైర్ సేఫ్టీ లేదు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో ప్రమాదం జరిగి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు అన్ని మాల్స్‌లో హడావుడి చేశారు. ప్రమాదం జరిగితే తప్పా అగ్నిమాపక శాఖ అధికారులకు నిబంధనలు గుర్తుకురావని నగర ప్రజలు దుయ్యబడుతున్నారు. సౌత్ ఇండియాలో జరిగిన ప్రమాదం వేరే మాల్ జరిగి ఉంటే దాని తీవ్రత మరో విధంగా ఉండేది. ఇప్పటికైనా మాల్స్‌లో పనిచేసే కార్మికులు, వినియోగదారులు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు, ఫైర్ సేఫ్టీ ఉండేలా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# ది గ్రేట్ మోసగాడు చంద్రబాబు

❖ పథకాలు ఇవ్వలేమని ప్రకటించి నిలువునా మోసం చేశారు

❖ వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్



(సత్యంన్యూస్, పలాస)

ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, ఎన్నికల హామీలతో మాయామర్మం చేసిన ది గ్రేట్ మోసగాడు నారా చంద్రబాబు నాయుడు ఎట్టకేలకు తన ముసుగు మొత్తం తీసేశారని వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌తో కలిసి ఆయన బుధవారం మాట్లాడారు. ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చారో, ఇవాళ ఆ హామీలను నెరవేర్చలేమని, పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను దగా చేశారని బాబుపై ధ్వజమెత్తారు. సాక్షాత్తూ సచివాలయంలోనే ఈప్రకటన చేయడం చంద్రబాబునాయుడి మార్కు, దగా మరోసారి రుజువు చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టడమేనని తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు మరోసారి నిజమయ్యాయన్నారు. మాట ఇచ్చి తప్పిన చంద్రబాబును, మాట మీద నిలబడ్డ జగన్మోహన్ రెడ్డిని ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారనీ, జగన్ విశ్వసనీయతను, ఆయన చిత్తశుద్ధిని, సంకల్పం ఎంత గొప్పవో మరోసారి ఈ సందర్భంగా అందరూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 9నెలల్లో దాదాపు రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చారని, మరి అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారని, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు.






# కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

◆ షాపుల కోసం కల్వర్టు దిశ మార్పు ◆ స్థానికులు అభ్యంతరాన్ని పట్టించుకోని నిర్మాణదారుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)



శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు పనులు నిర్వహించే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు వాకలవలస గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు విస్తరణలో భాగంగా వాకలవలస వద్ద ఉన్న కల్వర్టు నిర్మాణం అస్తవ్యస్థంగా మారిపోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి వరద, వాడుక నీరుతో పాటు మధురానగర్ లే-అవుట్, సమీపంలోని 15 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువ దిశను మార్చి నిర్మాణం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రోడ్డు విస్తరణలో కల్వర్టును కూడా విస్తరించాల్సి ఉండగా దీన్ని నిర్మించకుండా సిమెంట్ పైప్‌వేసి పూర్తి చేయాలన్న ఆలోచనతో పనులు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు ఆనించి ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షాపుల యజమానులతో చేతులు కలిపిన రోడ్డు కాంట్రాక్ట్ యాజమాన్య సిబ్బంది కల్వర్టు విస్తరణలో షాపులు తొలగించకుండా కాలువ దిశను మార్చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోకుండా ఒక సిమెంట్ పైప్‌ను ఏర్పాటుచేసి అక్రమంగా ఏర్పాటుచేసిన షాపులకు నష్టం జరగకుండా దిశను మార్చి కాలువ నిర్మిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై సదరు కాంట్రాక్ట్ సిబ్బందిని ప్రశ్నిస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, అందుకే తాము కల్వర్టును సిమెంట్ పైప్‌తో నిర్మిస్తున్నట్టు చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చని హెచ్చరించే ధోరణితో సిబ్బంది మాట్లాడుతున్నారని, షాపులను తొలగించకుండా కాలువ దిశ మార్చడంతో పాటు, సిమెంట్ పైప్‌తో నిర్మించడం వల్ల గ్రామం నుంచి వరద నీరు, పొలాలకు సాగునీరు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న నిర్మాణం వల్ల గ్రామం మీదుగా వెళ్లే మార్గం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విస్తరించే అవకాశం కోల్పోతామని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామం వద్ద రోడ్డు దాటడానికి డివైడర్ తొలగించడానికి నిబంధనలు అడ్డువస్తామని చెబుతున్న కాంట్రాక్ట్ యాజమాన్య సిబ్బంది సమీపంలోని ఒక దాబాకు వెళ్లేందుకు డివైడర్‌ను తొలగించారని, అత్యంత రద్దీగా ఉండే రోడ్డులో కాంట్రాక్ట్ యాజమాన్య సిబ్బంది నిబంధనలు పక్కన పెట్టి డివైడర్‌ను తొలగించడాన్ని తప్పుబడుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారుల స్పందించి రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.







Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.